క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలంలోని కేజీబీవీలో రెండు అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి 7వ తరగతి విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి రాంకిషన్‌రాజు ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 15 సాయంత్రం 5గంటల లోపు హసన్‌పర్తి విద్యాశాఖాధి కార్యాలయంలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

జ్ఞాన యజ్ఞ సప్తాహం ప్రారంభం



హన్మకొండ అర్బన్: నగరంలోని ఏషియన్ శ్రీదేవి మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో యజ్ఞానంద స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్ఞాన యజ్ఞ సహప్తం కార్యక్రమాన్ని మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండకోపనిషత్‌పై యజ్ఞానంద చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మందిరం ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, వెయ్యిగండ్ల రమేష్, పూస సురేష్‌కుమార్, బ్రహ్మచారిని లతికాచైతన్య, రాజయ్య పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



హసన్‌పర్తి: గానకోకిల అవార్డు అందుకున్న హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన పిట్టల భవానిని ఆదివారం సన్మానించారు. ఈమేరకు ఆమెను సుబేదారిలోని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాగరాజు అభినందించారు.

బోనాలకు రావాలని ఆహ్వానం



ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో ఈనెల 17న జరగనున్న బీరన్న బోనాలకు రావాలని జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్‌ను కోరారు. ఈమేరకు ఆయన స్వగృహంలో బీరన్న ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. సీతారాములు, మండల ప్రభాకర్, రాములు, కంచ మల్లయ్య, రవి, నరసింహరాములు, సాంబయ్య, రమేష్, రాజు ఉన్నారు.

నియామకం

హసన్‌పర్తి: ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గట్టు యుగంధర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శేషగిరిరావు ప్రకటించి ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు.

అభినందనలు

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రియాజ్‌ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యులు, టీఎన్జీవోస్ యూనియన్ నాయకులు సన్మానించారు. హైదరాబాద్‌లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీ కార్యాలయంలో ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పుల్లూరు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హన్మకొండ అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో హనుమకొండ సుబేదారి ప్రాంతానికి చెందిన చిరాజ్ అక్రమ్(30) ఆదివారం రాత్రి ఇంట్లో గొడవపడి వచ్చి పదునైన చాకుతో గొంతుకోసుకున్నాడు. స్థానికులు 108 అంబులెన్స్ సిబ్బందికి ఫోన్ చేయగా ఈఎంటీ ఎల్.సురేష్, పైలెట్ వెంకటేష్ వచ్చి సకాలంలో ప్రథమ చికిత్స అందించి ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా ప్రాణాపాయం తప్పింది.

పందుల స్వైర విహారం



వరంగల్: నగరంలోని 12వ డివిజన్ గాంధీనగర్, స్నేహనగర్, శ్రీరామకాలనీ, వీవర్స్‌కాలనీ, మైనార్టీ కాలనీల్లో పందులు గుంపులుగా స్వైర విహారం చేయడంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ప్రతిరోజూ కాలనీల్లో పందులు తచ్చాడుతూ ఇళ్ల లోపలికి వెళ్లి బీభత్సం సృష్టిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందులను కార్పొరేషన్ పరిధిలో నిషేధించినప్పటికీ పెంపకందారులు వాటిని జనావాసాల్లో వదిలిపెడుతున్నారని పలువురు వాపోతున్నారు. పందుల స్వైరవిహారంతో దోమలు ప్రబలి జ్వరాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఉన్నతాధికారులు, పాలకులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించరూ

- రోడ్డు మార్గం లేక ఇబ్బందులు
- ఖాళీ స్థలాల నుంచే రాకపోకలు
- లష్కర్‌సింగారం ఎస్సీ కాలనీవాసుల అవస్థలు

హన్మకొండ: తమ కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని హనుమకొండ లష్కర్ సింగారం ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఖాళీ స్థలాల్లో నుంచి రాకపోకలు సాగిస్తున్నామని చెబుతున్నారు. ప్లాట్లు చేసిన వారు సరైన రోడ్డు మార్గం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తన కాలనీ సమీపం నుంచి అంబేడ్కర్ భవన్ – సమ్మయ్య నగర్ మీదుగా 80ఫీట్ల రోడ్డుతో పాటు రాజాజీనగర్‌ను కలిపేందుకు రోడ్డు నిర్మించే అవకాశం ఉన్నా పాలకులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడాల్సివస్తోందని వాపోతున్నారు.



నాలా పక్కన రోడ్డు నిర్మాణానికి అనువుగా ఉన్న బఫర్ జోన్

బఫర్ జోన్‌లో రోడ్డు నిర్మిస్తే మేలు

సమ్మయ్యనగర్ – నయీంనగర్ నాలా పక్కన బఫర్ జోన్‌గా వదిలిపెడుతున్న 30 ఫీట్ల స్థలాన్ని రోడ్డుగా నిర్మిస్తే ఆ స్థలం కబ్జాకు గురికాకుండా ఉండడమే కాకుండా కాలనీవాసులకు రోడ్డు సౌకర్యం కల్పించినట్లవుతుంది. లష్కర్ సింగారం ఎస్సీకాలనీకి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఖాళీ స్థలాల నుంచే రాకపోకలు సాగిస్తుండడంతో వర్షాకాలంలో వారు అనేక బాధలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆదర్శకాలనీ మీదుగా రాకపోకలు సాగిస్తుండడంతో కిలోమీటరున్నర దూరం పెరుగుతోంది. సమ్మయ్యనగర్ – నయీంనగర్ నాలా వెంట బఫర్ జోన్ స్థలాన్ని రోడ్డుగా మారిస్తే వారికి ప్రధాన రోడ్డు 100 మీటర్ల దూరంలోనే ఉంటుంది. కాలనీలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఈక్రమంలో అధికారులు, పాలకులు స్పందించి నాలా పక్క నుంచి సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఖాళీ స్థలంలో నుంచి ఏర్పాటు చేసుకున్న దారిలో నుంచి వెళ్తున్న కాలనీవాసి

ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలి



లష్కర్ సింగారం ఎస్సీ కాలనీకి రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు మా కాలనీపై దృష్టి సారించి రోడ్డు సౌకర్యం కల్పించాలి. నాలా పక్కన బఫర్ జోన్‌లో రోడ్డు నిర్మించాలి.

– గుర్రం శామ్యూల్, ఎస్సీకాలనీ

రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నాం



మా కాలనీకి రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా గోడును పట్టించుకునే వారు కరువయ్యారు. కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం మా కాలనీని గుర్తించి రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– ముస్తాల సుందర్, ఎస్సీకాలనీ

ఖాళీ ప్లాట్లే కాలనీవాసులకు దారి



లష్కర్ సింగారంలోని ఎస్సీ కాలనీకి ఖాళీ స్థలాలే దారి. మాకు ఏ అవసరం వచ్చినా ఖాళీ స్థలాల్లో నుంచి రాకపోకలు సాగిస్తున్నాం. వర్షాకాలం వస్తే బురదమయం కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రమాదాలకు గురవుతున్నాం. పాలకులు లష్కర్ సింగారం ఎస్సీకాలనీ పట్ల చిన్నచూపు చూస్తున్నారు.

– అభినేష్, ఎస్సీకాలనీ

భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

ఖిలా వరంగల్: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా కోరారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఎండీ.అక్బర్ పాషా అధ్యక్షతన ఆదివారం మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి ముక్కుతాడు వేసేలా గట్టి ప్రతిపక్షం ఏర్పడిందని చెప్పారు. గతంలో మాదిరిగా మోదీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు కాలం చెల్లిందని ఎద్దేవాచేశారు. దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న ఎన్డీఏ ఆగడాలను అరికట్టేందుకు వామపక్ష లౌకిక శక్తులను కాంగ్రెస్ కలుపుకొనిపోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, ఎలేందర్, సౌందర్య, భవాని, తీగల కుమార్, యాకూబ్, రవి, రాజేందర్, ఎండీ.నవాంబీ, విజయలక్ష్మి, సువర్ణ, దివ్య, కుమార్, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి

ముదిరాజ్‌లను బీసీ ‘ఏ’ లోకి మార్చాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ కులస్తులు

ఖిలా వరంగల్: ముదిరాజ్‌లను బీసీ ‘డీ’ నుంచి బీసీ ‘ఏ’ లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ మహాసభ వాల్‌పోస్టర్లను వరంగల్ తిమ్మాపురం బెస్తం చెరువు వద్ద ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి తహసీల్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. ముదిరాజ్‌లందరు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ హనుమకొండ జిల్లా కార్యదర్శి పులి రజనీకాంత్, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమయ్య, మండల నేత ఉమేష్, బుస్సా వెంకన్న, సూరయ్య, డైరెక్టర్ రాజు, రమేష్, మోహన్, లక్క యాదగిరి, మేకల సతీష్, రాములు, చెక్క కుమారస్వామి, బొళ్ల బాబు, గుర్రం లక్ష్మీనారాయణ, అల్లీపూర్ గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని పలు రైల్వే విభాగాల్లో పనిచేస్తున్న రైల్వే కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను రైల్వే ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ ఏఆర్.రాజశేఖర్ కోరారు. కాజీపేట రైల్వే ఎస్సీ, ఎస్టీ కార్యాలయంలో శనివారం రాత్రి స్థానిక రైల్వే ఎస్సీ, ఎస్టీ నాయకులతో రాజశేఖర్ సమావేశమై పలు విషయాలపై చర్చించారు. పార్లమెంట్‌లో ప్రమోషన్ల బిల్లును ప్రవేశపెట్టాలని ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రైల్వే ఎస్సీ, ఎస్టీ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ బి.వీరన్న, జోనల్ ట్రెజరర్ కె.నాగేశ్వర్‌రావు, డివిజన్ ఉపాధ్యక్షుడు కేఎస్.రావు, కాజీపేట నాయకులు ఆర్.కుమారస్వామి, జక్రియా, లక్ష్మణ్, కుమార్, ప్రభాకర్, మురళి, శీనుబాబు, ధన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.



కాజీపేట రైల్వే నాయకులతో రాజశేఖర్

కార్మికుడికి తీవ్రగాయాలు



ఖిలా వరంగల్: ప్రమాదవశాత్తు భవనం మొదటి అంతస్తు నుంచి కార్మికుడు జారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని వినాయక నగర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికుల కథనం ప్రకారం మహారాష్ట్రకు చెందిన లక్ష్మీచందు గతేడాది వరంగల్‌కు వలస వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం భవనం మొదటి అంతస్తు వద్ద కర్రపై నిలబడి ఇసుక, సిమెంట్ అందుకుంటున్న క్రమంలో ఒక్కసారిగా గోవకర్ర విరిగి కిందపడి పోయాడు. దాంతో అతడి తల, నడుముకు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

గోశాలలో ఔషధ మొక్కల పంపిణీ

హసన్‌పర్తి: చింతగట్టులోని మహర్షి గోశాలలో ఔషధ మొక్కలను ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. తులసీ, తిప్పతీ, సజ్జ, నల్లేరు మొక్కలను పలువురికి అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోశాల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సర్జన రమేష్ మాట్లాడుతూ ఔషధ మొక్కలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ప్రతి ఇంటిలో ఇలాంటి మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు స్వామి నారాయణ, డి.కిషన్, కె.యాదగిరి, రాజమణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఔషధ మొక్కలను పంపిణీ చేస్తున్న రమేష్

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న శ్రీనివాస్, తదితరులు

ఖిలా వరంగల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని యోగా గురువు పోశాల శ్రీనివాస్ సూచించారు. హనుమకొండ శ్రీదేవి ఏషియన్ మాల్‌లో యోగా అభ్యాసం చేస్తున్న సాధకులు.. వన్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం ఖిలా వరంగల్ రాతికోటపై హరిత యోగా శిబిరం ఆధ్వర్యంలో ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాతో దీర్ఘకాలిక రుగ్మతలైన బీపీ, షుగర్, అలర్జీ, ఆస్తమా, తీవ్రమైన నొప్పులు, నడుం నొప్పులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో యోగా సాధకులు శ్రీనివాస్, వేణు, శ్రీకాంత్, డాక్టర్ మమత, లిఖిత, రాజయ్య, హయగ్రీవాచారి, చిన్నారులు పాల్గొన్నారు.

మొహర్రం ఏర్పాట్ల పరిశీలన



ఖిలా వరంగల్: మొహర్రం వేడుకల సందర్భంగా ఈనెల 17న మధ్యకోటలో నిర్వహించనున్న పీరీల ఊరేగింపు ఏర్పాట్లను ఎస్సై శ్రీకాంత్ ఆదివారం పరిశీలించారు. ముజావరులను అడిగి తెలుసుకున్నారు. ఊరేగింపులో పాల్గొనే ముస్లిం యూత్ సభ్యుల వివరాలను సేకరించారు. అనంతరం ఎస్సై శ్రీకాంత్‌కు చేతికి ముజావరి దట్టికట్టి నెమిలి ఈకలతో ఆశీర్వదించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హసన్‌పర్తి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థినులు

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయ పూర్వ విద్యార్థినుల (1992 – 93 ఎస్ఎస్‌సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాల ఆవరణలో జరిగిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థినులు ఒకచోట కలిసి గత స్మృతులను గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సుమతి, సువర్ణ, అనితారెడ్డి, రాజేశ్వరి, రాజశ్రీ, సరిత, మధురెడ్డి, సుధ, శ్రీరమారాణిని సన్మానించారు. హెచ్ఎం అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.



రాంపూర్‌లో సమ్మేళనంలో విద్యార్థులు, గురువులు

మడికొండ రాంపూర్‌లో..

మడికొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన 1998 – 1999వ పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధ, తారబాయి, చంద్రకళ, హలీం, విద్యార్థులు శంకర్, యాదగిరి, ఏకాంబ్రం, సంపత్, గోవర్ధన్, లక్ష్మణ్, అజిత్, రాజయ్య, కన్న తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్‌కు మొక్కులు

ఖిలా వరంగల్: వరంగల్ నాయుడు పెట్రోల్ పంపు ఎదురుగా సత్యసాయినగర్ కాలనీలో బంజారా (లంబాడీ) కుల పెద్దల ఆధ్వర్యంలో సత్ సేవాలాల్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వరంగల్ పర్యటనలో భాగంగా జాతీయ ఎస్టీ కౌన్సిల్ మెంబర్ జాటోతు హుస్సేన్ నాయక్ ఆదివారం రాత్రి సత్ సేవాలాల్ విగ్రహాన్ని దర్శించుకున్నారు. 21 కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్, కార్యదర్శి శ్రీనివాస్, కులపెద్దలు గుగులోతు రవి, గంగునాయక్, జాటోతు కృష్ణ, విజయ్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికంపై యుద్ధానికి చదువే ఆయుధం

దేశాయిపేట: పేదరికంపై యుద్ధం చేసేందుకు చదువే ప్రధాన ఆయుధమని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. ఆరెపల్లి సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల కళాశాలలో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రజ్ఞాపాటవాలు గల 30మంది విద్యార్థులకు తెలంగాణ చరిత్ర, ఎకనామిక్స్, జీకే పుస్తకాలను స్కూల్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ పిల్లలకు పోటీతత్వం అనేది చిన్ననాటి నుంచే అలవాటు చేయాలని సూచించారు. గ్రూప్స్ ప్రవేశ పరీక్షలకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత కోచింగ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర నాయకులు ఎస్.రామకృష్ణ, డి.చిరంజీవి, ఎస్.రాజు, శ్యామ్, జిల్లా నాయకుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి



నగదు అందజేస్తున్న నిర్వాహకులు

ఖిలా వరంగల్: సంఘ సభ్యుల సంక్షేమానికి మరింతగా కృషి చేస్తామని, వార్షికంగా వచ్చే లాభాలను ప్రతీ సభ్యుడికి పంపిణీ చేస్తామని ఏకశిల సేవా సంఘం శివనగర్ అధ్యక్షుడు బుదారపు భాస్కర్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని ఆర్యవైశ్య భవనంలో ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ రాజేష్ అధ్యక్షతన సంఘం వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన సంఘం సభ్యులకు రూ.35వేల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు తెలిపారు. సాధారణ రుణం రూ.లక్ష ఇరవై వేలను సభ్యులకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వార్షికంగా వచ్చిన లాభాల నుంచి ప్రతి సభ్యుడికి రూ.5వేలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి శ్రీరాం రాజేష్ ప్రవేశ పెట్టిన వార్షిక లావాదేవీలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన పాలకవర్గ అధ్యక్షుడిగా వైట్ల మల్లేశం, ప్రధాన కార్యదర్శి శ్రీరాంరాజేష్, కోశాధికారి వాసం రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గాంధీనగర్‌లో ‘స్వచ్ఛ భారత్’

హన్మకొండ: హనుమకొండలోని గాంధీనగర్‌లో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. గాంధీనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాలనీలోని వీధులను శుభ్రం చేశారు. వీధులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వెంకట రాజిరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని చెప్పారు. ఇంటిలోని వ్యర్థాలను రోడ్లపై వేయకుండా చెత్త బుట్టలో వేసి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహన డ్రైవర్‌కు అందించాలన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య, ఉపాధ్యక్షుడు ఎం.వీరేందర్, కోశాధికారి గోపగాని అశోక్, కాలనీవాసులు మల్లారెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్యాంప్రసాద్, కొండల్ రెడ్డి, అశోక్ రెడ్డి, రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనివాస్, శానిటరీ జవాన్ పవన్, తదితరులు పాల్గొన్నారు.



వీధిని శుభ్రం చేస్తున్న కమిటీ సభ్యులు

కూరగాయల మార్కెట్‌లో అపరిశుభ్రం

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
- పశువుల స్వైర విహారంతో ఇబ్బందులు
- నామమాత్రంగా గార్డుల విధులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని పండ్లు, కూరగాయల మార్కెట్ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నిర్వహణ లోపంతో పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా మారాయి. చిన్న చినుకు పడితే చాలు మార్కెట్ ఆవరణ మొత్తం బురదమయంగా తయారవుతోంది. దాంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వస్తున్న వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మార్కెట్ ఆవరణలోనే వ్యర్థాలు

ఎక్కడ పడితే అక్కడ మురిగిన కూరగాయలు పారేయడంతో వాటిని తినేందుకు పశువులు మార్కెట్ లోపలికి వస్తున్నాయి. పశువులు, వాహనాలు లోపలికి రాకుండా చూడాల్సిన సెక్యూరిటీ గార్డులు.. మార్కెట్ బయట జులాయిగా తిరుగుతున్నారే తప్ప విధులు సరిగా నిర్వర్తించడం లేదు. ఉదయం పూట మార్కెట్‌కు చుట్టపు చూపుగా వచ్చి అనంతరం కార్యాలయానికే పరిమితం అవుతున్నట్లు తెలిసింది. చెడిపోయిన కూరగాయాలను మార్కెట్ ఆవరణలోనే పారబోయడంతో దుర్వాసన వస్తోంది. అడిగేవారు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌లో ప్లాట్లు (మడిగెలు) కేటాయించినా నిర్దేశిత స్థలంలో కూరగాయలు పెట్టకుండా ముందుకువచ్చి కూరగాయలను పెట్టడంతో వినియోగదారులకు నడిచేందుకు దారి ఉండడం లేదు. మార్కెట్‌లో పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు, ఇతర సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా నిర్మల పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టినందునా సమస్యలు పరిష్కారం అవుతాయని నగర ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కూరగాయల మార్కెట్ ఆవరణలో తిరుగుతున్న పశువు

ఉపాధి లేక యువత పెడదారి పడుతోంది



వరంగల్: నిరుద్యోగులకు ఉపాధి లేక డ్రగ్స్, గంజాయి, మద్యపానం లాంటి దుర్వ్యసనాలకు బానిసవుతున్నారని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి ఆందోళన వ్యక్తం చేశారు. 12వ డివిజన్‌లోని కేఎల్.మహేంద్రనగర్ కాలనీలో ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి పరికరాల రమేష్, నాయకులు ఎస్కే.బాషుమియా, బుస్సా రవీందర్, ఎండీ.ఖాసిం, చంద్రకుమార్, మంద ఐలయ్య, ఎండి.షబానా, ఎండి.పాషా, ఎండి.అంజద్, లక్ష్మి, నిక్కత్, హరి తదితరులు పాల్గొన్నారు.